ప్రజాశక్తి

శనివారం 30 సెప్టెంబర్ 2023

5

అల్లూరి సీతారామరాజు

సెల్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కంద్రం పంచాయతీ బేడ్డగూడ గ్రామంలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణానికి స్థానిక పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి శుక్రవారం శంకుస్థాపన చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీ గ్రామాల్లో సెల్ సేవలు లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బిఎస్ఎన్ ఎల్ టవర్ నిర్మాణంతో గిరిజనులకు సెల్ కష్టాలు తీరుతాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జె.బలరాం, శోభన్ బాబు, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించాలని

ఎస్ఎఫ్ఐ నేతల ఆందోళన

ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా గిరిజన ప్రాంతంలో పాఠశాలలు, కళాశాలల వసతి గృహాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు కే.ప్రభుదాస్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జీవన్ కృష్ణ, చిన్నారావు తెలిపారు. ఎస్టీ హాస్టల్స్ లో సమస్యలు పరిష్కారం చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అల్లూరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అల్లూరి జిల్లాలో చలో కలెక్టరేట్‌లో భాగంగా ఐటీడీఏ ఎదుట విద్యార్థినీ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. హాస్టల్స్ లో సౌకర్యాలు మెరుగు పరచాలని కోరుతూ ఏపీవోను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, జిల్లాలో ఆశ్రమ, కస్తూర్బా, ఏకలవ్య, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, వసతి గృహాలు ఉన్నాయని తెలిపారు. వీటిలో విద్యార్థులకు మాత్రం కనీస వసతులు లేవని తెలిపారు. మెనూ కూడా పూర్తిగా సక్రమంగా అమలు కాలేదని ఆరోపించారు. వసతి గీహాలు సరిపోక పోవడం, అరకొరగా మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సప్లై సక్రమంగా లేకపోవడం, ఆహారంలో నాణ్యత లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ఆశ్రమ పాఠశాలల వసతి గృహాల్లో ప్రభుత్వం హెల్త్ వాలంటీర్లను తొలగించడంతో విద్యార్థులు అనారోగ్యంతో ఉన్నప్పుడు చాలా అవస్థలు పడుతున్నారని సకాలంలో వైద్యం అందని పరిస్థితి నెలకొంటుందన్నారు. దీంతో విద్యార్థుల మరణాలు కూడా సంభవి స్తున్నాయని చెప్పారు. జూనియర్, కస్తూర్బా ఏకలవ్య పాఠశాల కళాశాలలో పూర్తిస్థాయిగా ఉపాధ్యాయులు, లెక్చరర్స్ లేకపోవడంతో బోధన కుంటుపడిందని తెలిపారు. ఈ కారణంగా అనేక మంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అవుతున్నారని, ఈ విషయం పట్ల సంబంధిత అధికారులు స్పందించి పోస్టులను భర్తీ చేయాలన్నారు. పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిన్నారావు, జీవన్ కృష్ణ, జిల్లా కమిటీ నాయకులు నరేష్, మత్స్యరాజు, కార్తీక్, సింహాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా యువజనోత్సవాలు

ప్రజాశక్తి-పాడేరు: విద్యార్థుల ప్రతిభను, నైపుణ్యాన్ని కనబర్చి ప్రతి సంవత్సరం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సెప్టెంబర్ నుండి డిసెంబర్ మధ్య యువజన ఉత్సవాలు జరుపుతామని సెట్విజ్ మేనేజర్, యువజన సర్వీసుల శాఖ(విశాఖపట్నం) కె.వి. సత్యనారాయణమూర్తి తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో శుక్రవారం యువజన ఉత్సవాలు సెట్విజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వామి వివేకానంద దేశభక్తి, సందేశాలు, ప్రవచనాలను యువతీ యువకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతీ పనినీ ఇష్టంతో నేర్చుకుంటే విజయం సాధిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాడేరు, చింతపల్లి కళాశాలల ప్రిన్సిపాళ్ళు చిట్టబ్బాయి, . శ్రీనివాస పాత్రుడు, గవర్నమెంట్ కాలేజి వైస్ ప్రిన్సిపాల్ పి.చలపతి రావు, జి.మాడుగుల ఎపిఆర్ కాలేజి ప్రిన్సిపాల్ వై. పారయ్య పాల్గొన్నారు. యువతీ యువకుల జానపద గీతం, జానపద నృత్యం, స్టోరీ రైటింగ్, పోస్టల్ మేకింగ్, ఫోటోగ్రఫీ, చేతివృత్తుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబర్చిన యువతీ యువకులకు అతిథులు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి జి.గౌరిశంకర్, కుమారి సిహెచ్. అనిత, వి.రమేష్ బాబు, సీనియర్ అధ్యాపకులు ఎ.మురళీధరరావు, . ఎస్. చంద్రకళ, పి.కోటేశ్వరరావు, ఎం.అశ్వనిరెడ్డి పాల్గొన్నారు.

నృత్యంతో ఆకట్టుకున్న కళాకారులు

మాట్లాడుతన్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

వాహనమిత్రతో..

3,353 మందికి లబ్ధి

రూ. 3.35 కోట్ల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పాడేరు: వైఎస్సార్ వాహన మిత్ర ఆర్ధిక సహాయాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుళ్లి భాగ్య లక్ష్మి కోరారు. విజయవాడ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఐదవ విడత వాహన మిత్ర ఆర్ధిక సహాయం విడుదలను ప్రత్యక్ష ప్రసారాన్ని శుక్రవారం కలెక్టరేట్ నుండి వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో 3353 మంది వాహన మిత్ర లబ్దిదారులకు రూ.3కోట్ల 35 లక్షల 30 వేల ఆర్థిక సహాయం లబ్దిదారులకు సి.ఎం. జమ చేసారని చెప్పారు. ఆటో డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు తమ వాహనాలకు సంబంధించిన బీమా ధృవ పత్రాలు, ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు ఉంచుకోవాలని సూచించారు. పాదయాత్రలో డ్రైవర్ల వినతి మేరకు వైఎస్సార్ వాహన మిత్ర పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పాత వాహనాలు కొనుగోలు చేసినపుడు తప్పని సరిగా పేరు మీదకు బదలాయింపు చేసుకోవాలని సూచించారు. డాక్యుమెంటేషన్ పక్కాగా చేసుకోవాలన్నారు. డాక్యుమెంటేషన్ సక్రమంగా లేకపోతే పథకాలు వర్తించవని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. విధిగా వాహనాలకు భీమా చేసుకోవాలని సూచించారు. వాహన మిత్రలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అనంతరం లబ్దిదారులకు నమూనా చెక్కును పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి వి.మురళి, జిల్లా రవాణా అధికారి ఎస్.లీలా ప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, కె.వాసు, పరిపాలనాధికారి జి.శ్యామ్ ప్రభు, సిబ్బంది టి.అన్నాజీరావు, హరిశ్చంద్ర ప్రసాద్, వాహన మిత్ర లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని అనంతగిరి పంచాయతీ పరిధి లక్ష్మీపురం, బెడ్డగూడ, రాజుపాక గ్రామాలలో పశువైద్యశిబిరాలు నిర్వహించారు. అనంతగిరి పశువైద్యదికారి బి.సందిష్ శుక్రవారం డెక్క వ్యాధితో బాధపడుతున్న 100. పశువులు, 90 మేక్కలకు వ్యాది నిరోదిక టీకాలు వేశారు. పశువుల పరిసర ప్రంతాలు నీటి నిల్వలు లేకుండా ఉంచాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. పశువులు వ్యాదులకు గురైన వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. దీంతో, వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది కె.రావికుమార్, ఎం,సుందరరావు, అనీల్, అప్పారావు, రామ్మూర్తి, దిలీప్, మధుబాబు పాల్గొన్నారు

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్ కుమార్, అధికారులు

జిల్లాలో 297 ప్రత్యేక వైద్య శిబిరాలు

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- రంపచోడవరం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 297 స్పెషలిస్టు మెడికల్ క్యాంపులు నిర్వహణకు ప్రణాళిక వేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఇందులో 165 మంది ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొంటారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రంపచోడవరం నుండి పాల్గొన్న కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి మండలంలోనూ రెండు బృందాలను ఏర్పాటు చేశామని, ప్రతి రోజూ 10 నుండి 12 వైద్య శిబిరాలు నిర్వహించడానికి చర్యలు చేపట్టామని తెలిపారు. నవంబరు వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. గర్భిణులు, పోషకాహారం లోపంతో బాధపడే చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అంటువ్యాధులు నివారణకు అవసరమైన వైద్య సేవలను అందిస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యాలయం నుండి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత దేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ కృష్ణారావు, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరరావు, రంపచోడవరం నుండి ఎడిఎం అండ్ హెచ్ఓ జి.ప్రకాశం, తహాశీల్దారు జయ కుమార్, ఎంపీడీవో హరికృష్ణ, సిడిపిఓలు ప్రసన్న లక్ష్మి, సిహెచ్.లక్ష్మి, సంధ్యారాణి, మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ దొర, వైద్యాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర ఎన్టీఆర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఈ.శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ ఐడియల్ డిగ్రీ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 23న నిర్వహించిన అండర్ 19 బాలుర ఖోఖో పోటీల్లో తమ విద్యార్థులు ముగ్గురు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 26న కాకినాడలోని పిఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో అండర్ 19 అథ్లెటిక్స్ విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో ఒకరు, 400 మీటర్ల పరుగు పందెంలో ఒకరు, క్రికెట్ విభాగంలో ఒకరు ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎంపికకాబడిన ఆరుగురు విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ శాంతి రోజు, వైస్ ప్రిన్సిపల్ హరి, భోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు సురేష్

జిఒ 52ను తక్షణమే రద్దు చేయాలి

- ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సురేష్

ప్రజాశక్తి- చింతూరు

బోయ వాల్మీకిలు, బెంతు ఒడియాలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 52ను తక్షణమే రద్దు చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. మండలంలోని తుమ్మల గ్రామపంచాయతీ నారాయణపురం గ్రామంలో శుక్రవారం జరిగిన గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన హక్కులను కాలరాస్తున్నాయని, చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయని, దీంతో ఆదివాసీల మనుగడకే ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీలో బాక్సైట్ ఖనిజాలు, అడవులు, భూములను కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెట్టేందుకు 2023 నూతన అటవీ విధానాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. ఆదివాసీలకు ఉద్యోగ ఉపాధి కల్పిస్తున్న జీవో నెంబర్ 3న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్లు, మంచినీరు, విద్యుత్, ఆరోగ్య తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సవలం పంతులు, సోడే రాజయ్య, సోడే తమ్మయ్య, మడకం సురేష్, సోడే సతీష్, కలుమల సుబ్బయ్య, రవ్వ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎ.స్వామినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా భారీ వర్షం కురుస్తుండడంతో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోందని, కొండవాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని తెలిపారు. కేడీపేట నుంచి చింతపల్లి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో రామరాజుపాలెం, పెదమాకవరం గ్రామాల మధ్యలో ఉన్న కొండవాగులు ఉప్పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఈ మార్గంలో జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా, ఆ గ్రామాల మధ్యలో వంతెన నిర్మాణం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో చింతపల్లి వెళ్లే ప్రయాణికులు, కొయ్యూరు నుంచి బూదరాళ్ల, చాపరాతిపాలెం మీదుగా, లేదంటే కేడీపేట, డౌనూరు మీదుగా చింతపల్లి వెళ్లాలని ప్రజలకు సూచించారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శివ శ్రీనివాస్

ప్రత్యేక శిక్షణతో ఉపాధి అవకాశాలు

జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

ప్రజాశక్తి-పాడేరు,డుంబ్రిగుడ: అల్లూరి సీతారామరాజు డిస్ట్రిక్ట్ అసోషియేషన్ అఫ్ ది డెఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన బదిరుల సంజ్ఞా భాష బ్రోచర్‌ను సంయుక్త కలెక్టర్ జె. శివశ్రీనివాసు ఆవిష్కరించారు. బుధవారం డుంబ్రిగూడ మండలంలో జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమం సందర్భంగా డుంబ్రిగూడ విచ్చేసిన జెసి అక్కడ నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ బ్రోచర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, చేతి సైగల శిక్షణను ప్రతి ఒక్కరికీ ఇప్పించి బదిరులను ప్రోత్సహించాలని సూచించారు. వారి అర్హతల మేరకు ప్రభుత్వం తరపున పింఛను మంజూరుకు, ఉపకరణాలు పంపిణీకి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో వారి స్వయం ఉపాధికి, ఆర్థికాభివృద్ధికి ప్రోత్సహిస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఎం ఉషారాణి, తహసిల్దార్ సిహెచ్ నాగమ్మ, అల్లూరి సీతారామరాజు డిస్ట్రిక్ట్ అసోషియేషన్ అఫ్ ది డెఫ్ ప్రతినిధులు, పలువురు బదిర విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థితో చదివిస్తున్న గంగరాజు

గురుకులంలో సమస్యలపై

జెడ్‌పిటిసి గంగరాజు ఆరా

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని గుమ్మకోట ఏపిఆర్ గురుకులం పాఠశాలను జెడ్‌పిటిసి గంగరాజు శుక్రవారం సందర్శించారు. మౌలిక వసుతులు, విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ నరసింహమూర్తి మాట్లాడారు. పాఠశాలలో కరెంట్ సింగిల్ ఫేస్ కావడంతో విద్యుత్ లోడు సరిపోలేదని డబ్బల్ ఫేస్, త్రి ఫేస్ ఇవ్వాలని ప్రిన్సిపాల్ కోరారు. పాఠశాలలో అదనపు బోరుకు జడ్పిటిసి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం గంగరాజు మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమస్యలను పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ సుమీత్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి .అభిషేక్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి.సుభద్ర ల దృష్టికి తీసుకు వెళ్లి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానన్ని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టోకురు సిపిఎం సర్పంచ్ కిల్లో.మోస్య, సిపిఎం మండల కార్యదర్శి సోమెల నాగులు, గిరిజన సంఘం కార్యదర్శి జన్ని సుబ్బారావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి-రంపచోడవరం

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సమావేశం మట్ల వాణిశ్రీ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా చేసిన పాదయాత్ర సందర్భంలోనూ, 2019 ఎన్నికల సమయంలోనూ జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చి మాట తప్పును, మడమ తిప్పును అని చెప్పిన ఆయన నేడు మాట మడమ రెండూ తిప్పేశారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో లక్షా 50వేల మంది పైగా కాంట్రాక్టు ఉద్యోగులు ఉండగా, కొంత మందిని పర్మినెంట్ చేస్తామని చెప్పడం సరికాదన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ కనీసవేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల సమస్యలను పరిష్కరించకుండా ఎక్కడికక్కడ నిర్బంధాలు ప్రయోగించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకట్, జిల్లా నాయకులు పి.సత్యనారాయణ, బి.నిర్మల, కె.రాణి, కె.చెల్లాయమ్మ, కె.వీరబాబు, కె.శాంతిరాజు, లక్ష్మణ్, కె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

బ్యాంకు ఖాతాలు రీ ఓపెన్ చేయాలని ఆందోళన

ప్రజాశక్తి -సీలేరు

తమ బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ అయ్యాయని, వెంటనే వాటిని రీ ఓపెన్ చేయాలని సీలేరు యుబిఐ బ్యాంకు వద్ద జీకే వీధి మండలం దారకొండ, గుమ్మరేవులు, గాలికొండ, సీలేరు, దుప్పిలివాడ పంచాయతీల గిరిజన రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. అనంతరం బ్యాంకు మేనేజర్ డి. చిన్నబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బ్యాంకు ఖాతాలో ఎన్ఆర్ఇజిఎస్, అమ్మఒడి, రైతు భరోసా, చేయూత, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఎల్ఐసి డబ్బులు జమ అవుతున్నాయని, అకౌంట్లు ఫ్రీజ్ కావడంతో ఆ డబ్బులు తీసుకోవటానికి కుదరడం లేదని పేర్కొన్నారు. తాము తీసుకున్న క్రాఫ్ లోన్లు విడత విడుతలగా అప్పు తీర్చుస్తామని విన్నవించారు. గత రెండు మూడేళ్ల నుంచి పంటలు పండకపోవడం, కరోనా మహమ్మారి వల్ల అనేక ఇబ్బందులుకు గురికావాల్సి వచ్చిందని, పంట రుణాలు తీర్చడానికి కొంత సమయం కావాలని గిరి రైతులు విజ్ఞప్తి చేశారు. దీనికి బ్యాంకు మేనేజర్ చిన్నబాబు స్పందిస్తూ రైతుల వినత పత్రంలో పొందుపరిచిన అంశాలను తమ ఉన్నతాధికారులకు నివేదిస్తానని పేర్కొన్నారు. రైతులు తీసుకున్న రుణాలు కట్టకపోవడం వల్ల వడ్డీలతో అప్పు అధికమవడంతో ఆర్‌బిఐ నిబంధనలు ప్రకారం అకౌంట్లు ఫ్రీజ్ చేసినట్లు చెప్పారు. దీనిపై బ్యాంకు మేనేజర్‌ను స్థానిక విలేకరుల వివరణ కోరగా 2020లో 688 మంది రైతులు పంట రుణాలు పొందారని, 2021లో వీరి రుణాలు రెన్యువల్ కావాల్సి ఉండగా, ఇప్పటివరకు రెన్యువల్ కాలేదని వెల్లడించారు. నాడు వీరికి రూ.8 కోట్ల 65 లక్షల 6వేలు రుణాలు మంజూరు చేయగా, ప్రస్తుతం రూ.9,23,31,500 బకాయి ఉందని పేర్కొన్నారు. పాత రుణాలు చెల్లిస్తే కొత్త రుణాలు ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన రైతులు, నాయకులు

అప్పులు బాధలు తాళలేక గిరిజన రైతుల ఆత్మహత్య

గుమ్మరేవుల, దుప్పిలివాడ మాజీ సర్పంచ్‌లు బాబురావు, అల్లంకి రాజు మాట్లాడుతూ దారకొండ పంచాయతీ గంగవరం గ్రామానికి చెందిన గిరిజన రైతులు కిలో రాజేష్ (21) దొర హద్దు (30) అప్పుల బాధ లేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. దీంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు రుణాల బాధతో ఆత్మహత్య చేసుకోకుండా ఉండాలంటే రుణాలు చెల్లించడానికి గడువు ఇవ్వాలన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ స్పందించి బ్యాంక్ యాజమాన్యంతో సంప్రదించి గిరి రైతులను ఆదుకోవాలని కోరారు. వారి అకౌంట్లు బ్యాంక్ అధికారులు ఓపెన్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన రైతులు మార్కు రాజు, మల్లు దొర, రాంబాబు, రామ్మూర్తి, రామారావు, పెద్ద సంఖ్యలో బాధిత రైతులు పాల్గొన్నారు.

మన్యంలో కుండపోత వర్షం

అరకులోయలో జలమయమైన రోడ్డు

ప్రజాశక్తి- అరకులోయ:పర్యాటక కేంద్రమైన అరకులోయ పరిసర ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం మంచు దుప్పటితో కప్పుకొని చలికాలాన్ని తలపింప జేసింది. మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ వేడిమితో వాతావరణం వేసవి కాలాన్ని తలపించేసిన రెండు గంటల సమయం నుంచి ఏకధాటిగా కుండపోత వర్షం కురిసింది. అరకులోయలోని రోడ్లు వర్షపు నీటితో నిండి పోయాయి. కాలువలు పొంగి ప్రవహించాయి. కుండపోత వర్షం కురవడంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పిడుగుపాటుకు పశువుల మృతి

జి.మాడుగుల: మండలంలో గల సులబం పంచాయతీ బెల్లం గరువు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి భాస్కరరావు అనే గిరిజన రైతుకు చెందిన మూడు పశువులపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు ఆవులు సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని, ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

మృతి చెందిన పశువు

మూల కణ పరిశోధనలపై జాతీయ సదస్సు

జాతీయ సదస్సు ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి- మధురవాడ: మూలకణ పరిశోధనలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ సదస్సును గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ ప్రారంభించారు. బయోటెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులపై విద్యార్థులు, పరిశోధకులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్, బయోటెక్నాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ షేక్ ఖాసీంబీబీ, సదస్సు కోకన్వీనర్ ఆర్.గోపీనాథ్ పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సిసిఎంబి) శాస్త్రవేత్త డాక్టర్ బి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, కంటిలో కార్నియా చికిత్సలో మూలకణాల ప్రాధాన్యతను తెలిపారు. గీతం బయోకెమిస్ట్రీ విభాగం అధిపతి ప్రొఫెసర్ మళ్ళ రామారావు రొమ్ముకేన్సర్ మూల కణాలపై మాట్లాడారు.. అమెరికాలోని టెక్సాస్‌లోని ఎఅండ్‌ఎమ్ విశ్వవిద్యాలయం రీసెర్చి డైరక్టర్ ప్రొఫెసర్ ప్రేమ్‌కుమార్ బి.సగంటి అంతరిక్షంలోకి వెళ్ళే వ్యోమగాములలో శారీరక మార్పులు, రేడియేషన్ ప్రభావంపై తమ పరిశోధనలను వివరించారు. ఈసందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన బయోటెక్నాలజీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.పద్మావతి దొరోతిని ఘనంగా సన్మానించారు.

రోడ్డు సౌకర్యం లేక..

ఇంటింటికీ అందని రేషన్

- ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు
- మునుపటి కంటే నానా అవస్థలు

మధ్య దారిలో సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: రేషన్ లబ్ధిదారులు జిసిసి డిపోలకు వెళ్లి రేషన్ బియ్యం తీసుకోవడానికి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పథకాన్ని అమలు పరిచి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. మండలంలోని పలు మారుమూల గ్రామాల్లో రోడ్డు సౌకర్యం లేక ఇంటింటికి రేషన్ పథకం సక్రమంగా అమలు కాలేదు. దీంతో మారుమూల గిరిజనులు మూడు, నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి మార్గమధ్యలో లేక రేషన్ డిపోలకు వెళ్లి బియ్యం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

మండలంలోని కండ్రుం పంచాయితీ సొర్నాయిగూడ జంక్షన్ నుంచి కక్కుడుబేడ్డ గ్రామం వరకు గతంలో బీటి రోడ్డు మంజూరు అయ్యింది. ఇప్పటి వరకు రోడ్డు పూర్తిగా నిర్మించక పోవడంతో ఈ రోడ్డుకు ఆనుకొని ఉన్న గ్రామాల గిరిజనులు రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు అసంపూర్తిగా ఉండటంతో 108 అంబులెన్స్, ఇంటింటికి రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనం ఆ గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో, తప్పని పరిస్థితిలో మూడు, నాలుగు కిలోమీటర్ల దూరం స్వర్ణాయిగూడ జంక్షన్ వద్దకు వెళ్లి రేషన్ బియ్యం తీసుకుని కాలినడకన మోసుకుని వెళ్తున్నామని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డు పూర్తి చేయాలని పలుమార్లు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఇప్పటి వరకు పట్టించుకోక పోవడంతో రవాణా సౌకర్యానికి ఇబ్బందులు తప్పలేదని ఆయా ప్రాంతాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తిగా నిర్మించి రవాణా కష్టాలను తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు.

కౌలు రైతులకు రుణాలివ్వాలి

ప్రజాశక్తి-పాడేరు: వార్షిక రుణ ప్రణాళిక మేరకు కౌలు రైతులకు శత శాతం రుణాలు మంజూరు చేయాల్సిందేనని సంయుక్త కలెక్టర్ జే.శివ శ్రీనివాసు బ్యాంకర్లకు స్పష్టం చేశారు. శుక్రవారం డుంబ్రిగుడ నుండి వర్చువల్‌గా బ్యాంకర్ల త్రైమాసిక సమీక్ష సమావేశంలో పాల్గొన్న జేసి మాట్లాడుతూ, వ్యవసాయానికి కేటాయించిన రూ.1279 కోట్లలో ఇప్పటి వరకు 40 శాతం రుణాలు మంజూరు చేశారన్నారు., వ్యవసాయ అనుబంధ సంస్థలకు టర్మ్ లోన్ల కింద రూ.184 కోట్ల రుణాలకు 48.69శాతం మంజూరు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా జేసి వ్యవసాయ రుణాలను శత శాతం పూర్తి చేయాలని ఆదేశిస్తూ కౌలు రైతులకు కూడా రుణాలు మంజూరు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రాధాన్యతా రంగాలకు రూ.2174 కోట్ల రుణ లక్ష్యం కాగా ఇప్పటివరకు కేవలం 27.32 శాతం మాత్రమే మంజూరు చేశారన్నారు, అప్రాధాన్యతా రంగాలకు కొంత మెరుగుగా 42.44 శాతం మంజూరు చేసినారని తెలిపారు. ఎంఎస్ఎంఇ రంగంలో కూడా రుణాలు మంజూరు చేసి పారిశ్రామిక అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ త్రైమాసిక సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ప్రతినిధి ఇఖ్బల్ రెహమాన్, జిల్లా ప్రధాన కేంద్రం నుండి యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ పి. నరేష్, నాబార్డ్ డిడిఎం జి.ఆర్. శుంఠ కుమార్, ఎల్ డి ఎం. ఎస్ రేలవిజేజ, వ్యవసాయ, పారిశ్రామిక సహాయ సంచాలకులు విజయ కుమార్, నవీన్ కుమార్, వివిధ బ్యాంకుల కంట్రోలర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

ప్రజాశక్తి- సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించినట్లు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె.రాజు తెలిపారు.

'జగనన్నకు చెబుదాం'కు సమస్యల వెల్లువ



వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న పిఒ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకుగాను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా పలువురు ఐటీడీఏ పిఓ అభిషేక్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ హాజర్ కాకపోవడంతో ఈ కార్యక్రమానికి ఐటిడిఎ పీవో తోపాటు జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. పోతంగి పంచాయతీ డుంబ్రిగూడలో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణంతో పాటు చంపపట్టి గెడ్డ వద్ద వంతెన నిర్మించాలని స్థానిక పంచాయతీ ఎంపిటిసి గీత అధికారులకు వినతిపత్రం అందజేశారు. వీటితో పాటు పలు పంచాయతీ గ్రామాల నుంచి గిరిజనులు వారి సమస్యలను పరిష్కరించాలని వ్యక్తిగతంగా వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తహసిల్దార్ సిహెచ్ నాగమ్మ, ఎంపీడీవో ఉషారాణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు, వంతెన పూర్తి చేయాలని వినతి

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి రోడ్డు, గత్తర జిల్లెడ వద్ద నిర్మిస్తున్న వంతెనను పూర్తి చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ పీవో అభిషేక్ కు కొర్రాయి సర్పంచ్ పి.కొములు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, గత రెండేళ్ల క్రితం నిర్మాణ పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేయడంతో కొర్రాయి, కొల్లాపుట్టు పంచాయతీలతో పాటు ఈ ప్రాంత వాసులు రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ రోడ్డు ఆంధ్ర ఒడిశాకి కనెక్టివ్‌గా ఉందని , బ్రిడ్జి అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న వంతెనను పూర్తి చేసి రవాణా సౌకర్యానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. మండల వైస్ ఎంపీపీ లలిత, పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సిద్ధ ఔషధ పరిశోధనలకు సహకారం

గీతం వర్సిటీతో బొటానిక్ హెల్త్ కేర్ ఎంఒయు

ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : ప్రకృతిసిద్ధ ఔషధ పరిశోధనలలో పరస్పరం సహకారంతో అధ్యయనాలను నిర్వహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో కర్ణాటక కేంద్రంగా గల బొటానిక్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ శుక్రవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కన్సల్టెన్సీ, కొలాబరేషన్స్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు సమక్షంలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్ తరన్‌దాస్, బొటానిక్ హెల్త్‌కేర్ లిమిటెడ్ గ్లోబల్ బిజినెస్ డెవలప్‌మెంట్ డైరక్టర్ డాక్టర్ హెచ్ఎన్.శివప్రసాద్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

ఈ సందర్భంగా గీతం కన్సల్టెన్సి, కొలాబరేషన్స్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు మాట్లాడుతూ పరిశ్రమలతో మెరుగైన సంబంధాలకు గీతం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. పరిశోధనల ద్వారా రానున్న సంవత్సరాలలో గీతం ప్రపంచ ఖ్యాతిని పొందాలన్న లక్ష్యంతో ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నామన్నారు. దీనికోసం గీతం ఆధ్వర్యంలో విశాఖ, హైదరాబాద్, బెంగళూరులలో మూర్తి పేరిట భారీవ్యయంతో అధునాతన ప్రయోగశాలలను నెలకొల్పుతున్నట్లు వెల్లడించారు. బొటానిక్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ గ్లోబల్ బిజినెస్ డవలప్‌మెంట్ డైరక్టర్ డాక్టర్ హెచ్.ఎన్.శివప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన ఔషధ ఉత్పత్తులలో తమకు ఇరవైఏళ్ల అనుభవం ఉందన్నారు. ప్రపంచంలోని అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, కెనడా, దక్షణకొరియా, యూరప్ తదితర దేశాలలో తమకు శాఖలు ఉన్నాయన్నారు. గీతంతో సంయుక్త పరిశోధనలను నిర్వహించడానికి తాము ఆసక్తితో ఉన్నామన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్‌తరన్‌దాస్ మాట్లాడుతూ ఫార్మసీ పరిశోధనలలో తమ ఫ్యాకల్టీ సభ్యులు వివిధ ప్రాజెక్టులను నిర్వహిస్తున్నారన్నారు.బొటానికల్ హెల్త్‌కేర్ సంస్థతో సంయుక్త అధ్యయనాలు జరుపుతామన్నారు. కార్యక్రమంలో గీతం కన్సల్టెన్సీ, కొలాబరేషన్స్ డిప్యూటీ డైరక్టర్ సోంభట్‌శాస్త్రి, గీతం స్కూల్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రాజా, డాక్టర్ సునీత పాల్గొన్నారు.

మేలైన పద్ధతులతో అధిక దిగుబడి

స్పైసెస్ బోర్డు డైరెక్టర్ ధర్మేంద్ర దాస్

ప్రజాశక్తి పాడేరు : మిరియాల సాగులో మైలైన వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడు వస్తాయని స్పైసెస్ బోర్డు డైరెక్టర్ ధర్మేంద్ర దాస్ అన్నారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో మండలంలోని మోదాపల్లి గ్రామానికి చెందిన మిరియాలు సాగు చేస్తున్న రైతులకు సాగులో మెళకువలపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పైసెస్ బోర్డు డైరెక్టర్ వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. మిరియాల సాగులో అధిక దిగుబడులు సాధించడానికి స్పైసెస్ బోర్డు ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకుని రైతులు మిరియాల సాగులో మంచి దిగుబడులు సాధించాలన్నారు. రైతులు మాట్లాడుతూ, స్పైసెస్ బోర్డు ద్వారా టార్పాలిన్లు, అల్యూమినియం నిచ్చెనలు, మిరియాలు వలిచే యూనిట్లు, వర్మీ కంపోస్టు యూనిట్లు, అందించాలని కోరారు. స్పైసెస్ బోర్డు డైరెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫీల్డు ఆఫీసర్ బి.కళ్యాణి, సబ్జెక్టు నిపుణులు జంగయ్య, మోదాపల్లి సర్పంచ్ కె. మంగమ్మ, వెంకటరమణ, రైతులు , తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

అసంపూర్తిగా పునరావాస కాలనీ

- రోడ్లు, డ్రెయిన్లు, స్కూల్, అంగన్వాడీ భవనాలు పూర్తి కాని వైనం
- అరకొర వసతుల మధ్య నిర్వాసితుల జీవనం
- కన్నాయిగూడెం కాలనీని పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి-విఆర్.పురం : యటపాక మండలం కన్నాయిగూడెంలోని పోలవరం నిర్వాసిత పునరావాస కాలనీ నిర్మాణం అసంపూర్తిగా ఉందని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. కనీస వసతుల లేక నిర్వాసితులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ములకపల్లి నిర్వాసితులకు ఇచ్చిన కన్నాయిగూడెం పునరావాస కాలనీని ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు నేతృత్వంలో సిపిఎం బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా అక్కడ నివాసముంటున్న ములకపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ అన్ని వసతులు ఉన్నాయని చెబితే వచ్చామని, ఇక్కడ ఇళ్ళు తప్ప మరేం మౌలిక సదుపాయాలు కల్పించలేదని పేర్కొన్నారు. రోడ్లు, డ్రెయిన్లు, అంగన్వాడీ, పాఠశాల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. భూమికి బదులు ఇచ్చిన భూములు జామాయిల్ ముళ్లతో ఉన్నాయన్నారు. వాటిని శుభ్రం చేసి తమకు భూమి అప్పగించాలని, లేకుంటే తమ బతుకు దెరువు ఎలా అని వాపోయారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ములకపల్లి, ఇప్పూరు, ముత్యాలమ్మగండి, కల్తునూర్ తదితర గ్రామాల నిర్వాసితులకు మొత్తం 329 ఇళ్లకు గాను 279 సింగిల్ ఇళ్లు, 50 డబల్ ఇళ్ల నిర్మాణం 2017లో ప్రారంభించగా, వాటిలో ఇంకా 18 ఇళ్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉందని తెలిపారు. తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన రెండు మోటర్లతో ఒకటి పని చేయడం లేదన్నారు. వీధి దీపాలు వెలగడం లేదని, వర్షానికి కొన్ని ఇళ్ల స్లాబ్‌లు కారిపోతున్నాయని తెలిపారు. 2022లో వచ్చిన వరదలకు సగం ఇళ్లు మునిగిపోయాయని చెప్పారు. తక్షణమే ఈ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పూనెం సరోజిని, పులి సంతోష్ కుమార్, వెట్టి లక్ష్మి, కారం బుచ్చమ్మ, సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, జి.లక్ష్మణరావు, వడ్లది రమేష్, నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు.. భగత్‌సింగ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చిన్న వయసులోనే ఉద్యమ బాట పట్టిన భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని ప్రభుత్వ మహిళా ఇంటర్ కాలేజీ హిస్టరీ లెక్చరర్ శంకరరావు అన్నారు. పిడిఎస్ఒ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి సభ ప్రభుత్వ మహిళా ఇంటర్ కళాశాలలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయోద్యమంలో భగత్ సింగ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. నేడు సమాజంలో జరుగుతున్న దోపిడీ, అన్యాయాలపై ఆయన స్ఫూర్తితో ఉద్యమించాలన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను, తదితరులు పాల్గొన్నారు.

మురికివాడల ముసుగులో టిడిఆర్ కుంభకోణాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో మురికివాడల ముసుగులో టిడిఆర్ కుంభకోణాలు జరుగుతున్నాయని, తాడేపల్లి ప్యాలెస్ ఒత్తిళ్లతో ఇష్టారాజ్యంగా టిడిఆర్‌లు ఇస్తున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. శుక్రవారం ఉదయం మేఘాలయ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ సీతమ్మధార సమీపంలోని రేసపువానిపాలెంలో 3.87 ఎకరాల బిలాల్ కాలనీలో ఎంపీ ఎంవివి సత్యనారాయణ ఆంధ్ర బ్యాంక్ హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ ముసుగులో రూ.వెయ్యి కోట్లు టిడిఆర్‌కు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విజయసాయిరెడ్డి, తదితరులు వేర్వేరు చోట్ల ఇదే ప్రయత్నాల్లో ఉన్నారని చెప్పారు.

ఉక్కు రక్షణతో విశాఖ మరింత అభివృద్ధి

- మోడీ సర్కారు ప్రైవేటీకరణ కుట్రలను తిప్పికొడతాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం
- పదో రోజుకు చేరిన బైకు యాత్ర

హెచ్‌పిసిఎల్ గేటు వద్ద జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి - ములగాడ, మాధవధార విలేకరులు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌తో విశాఖ మరింత అభివృద్ధి చెందనుందని, ఈ నేపథ్యంలో ప్లాంట్‌ను కాపాడుకోవడానికి అందరూ పోరాటంలోకి రావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. ఈ నెల 20న ప్రారంభమైన ఉక్కు రక్షణ యాత్ర శుక్రవారానికి పదో రోజుకు చేరింది. మల్కాపురం, కంచరపాలెం జోన్లలో పలుచోట్ల ఈ యాత్ర సాగింది. ఎక్కడికక్కడ మహిళలు, ప్రజలు పూలు జల్లి యాత్రా బృందానికి ఘన స్వాగతం పలికారు. తొలుత పారిశ్రామిక ప్రాంతమైన మల్కాపురంలో ఈ యాత్ర ప్రారంభమైంది. శ్రీహరిపురం కోరమండల్ గేటు వద్దకు చేరుకుంది. అక్కడ జివిఎంసి, ముఠా కార్మికులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. హెచ్‌పిసిఎల్ లేబర్ గేట్ వద్ద బహిరంగ సభ జరిగింది. అనంతరం పారిశ్రామిక ప్రాంతం గుండా యాత్ర సాగుతూ మాధవధార బిర్లా జంక్షన్, కంచరపాలెం ఏరియాలను కలియదిరిగింది. ఆయా చోట్ల జరిగిన సభల్లో లోకనాథం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై జరుగుతున్న కుట్రలను వివరించారు. విభజన చట్టంలోని హామీలను కేంద్రం అమలు చేయకుండా ఎలా నాటకాలు ఆడుతోందో తెలిపారు. మోడీ సర్కారు దేశ సంపదను అదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తోందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్లాంట్‌ను అమ్మేస్తాం.. లేదంటే మూసేస్తాం అని బహిరంగంగా ప్రకటిస్తున్నా రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనలు కిమ్మనకపోవడం దారుణమన్నారు. ప్లాంట్‌లోకి ఎవరు అడుగు పెట్టినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ విధానాల వల్ల ఆకలి, నిరుద్యోగం పెచ్చరిల్లుతున్నాయన్నారు. త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో నిలబెట్టుకుంటామన్నారు. ప్లాంట్ ప్రజల సంపదని, మోడీకి అమ్మే హక్కు లేదని అన్నారు. అక్టోబర్ 5న స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మల్కాపురం జోన్‌లో జరిగిన సభల్లో సిపిఎం నాయకులు పి.పైడిరాజు, ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, భాస్కరరావు, బాబూరావు, సత్యారావు, ఆర్.విమల పి.వరలక్ష్మి, రాజేశ్వరి, అన్నపూర్ణ, కల్యాణి దొడ్డమ్మ, ఆదిలక్ష్మి, కె.నూకరాజు దేవరాజు బి.తాతాజీ, వాసు, వై.గంగాధర్, కంచరపాలెం జోన్‌లో జరిగిన సభల్లో బి.పద్మ, బి.ఈశ్వరమ్మ, కూన వెంకటరావు, అప్పారావు, ఎం.ఈశ్వరరావు, ఎస్.శ్రావణ్, ఎ.పుష్పాంజలి సాహూ, ఒ.విజయ, సనపల రామ్‌గోపాల్‌రావు, పి.శ్రీదేవి, పివి.రమణ, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ముంచుతున్నది బిజెపి కాదా ?
సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు

విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌ను ముంచుతున్నది కేంద్రంలోని బిజెపి కాదా ? అని సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు ప్రశ్నించారు. అక్టోబర్ 5న 'చలో స్టీల్‌ప్లాంట్' పేరిట కూర్మన్నపాలెం జంక్షన్ సమీపంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద తలపెట్టిన ఉక్కు రక్షణ బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన శుక్రవారం జగదాంబ దరి నండూరి ప్రసాదరావు భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను బలహీనం చేసే ప్రయత్నాలు ముమ్మరమవుతున్నాయన్నారు. ఉత్పత్తిని 40 శాతం తగ్గించి గత ఏడాది రూ.3900 కోట్లు నష్టం రావడానికి బిజెపి సర్కారే కారణమన్నారు. దేశంలో అన్ని స్టీల్‌ప్లాంట్‌లకు లాభాలు వచ్చాయని, నాణ్యమైన స్టీల్ ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న విశాఖ స్టీల్‌కు మాత్రం ఎందుకు నష్టాలొచ్చాయని ప్రశ్నించారు. ముడిఖనిజం రాకుండా అదానీని అడ్డుపెట్టుకున్నారని విమర్శించారు. ఎన్ఎండిసి నుంచి ముడిఖనిజం ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం మోకాలడ్డుతోందన్నారు. బ్లాస్ట్‌ఫర్నేస్ - 3ను జిందాల్ స్టీల్‌కు అప్పగించడానికి కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. గతంలో బిఎస్ఎన్ఎల్‌ను బలహీనపర్చి రిలయన్స్‌కు అప్పగించిందన్నారు. విశాఖ స్టీల్‌ను జిందాల్, పోస్కోలకు అప్పగించడానికి తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అదానీ గురువారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని విజయవాడ పేలస్‌లో కలవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణకు చేపట్టిన బైకు యాత్రకు ఉత్తరాంధ్ర ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు, పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

విత్తన బంతుల పంపిణీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పర్యావరణ పరిరక్షణకు పచ్చని చెట్లు అవసరమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. శుక్రవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయ ఆవరణలో దేశీయ అడవి విత్తనాలను ఉపయోగించి మట్టి, పేడ కలిపిన విత్తన బంతులను స్వయంగా తయారు చేసి జివిఎంసి ఉద్యోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విశాఖ నగరంలో ఉన్న కొండలపై సుమారు రెండు లక్షల విత్తన బంతులను అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున నేవల్ అధికారుల సహకారంతో హెలికాప్టర్ ద్వారా జారవిడువనున్నట్టు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం చెత్తాచెదారం లేని స్వచ్ఛమైన విశాఖ నగరాన్ని తీర్చిదిద్దేందుకు జివిఎంసి నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో విశాఖను పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు నగర పౌరులు స్వచ్ఛభారత్ అంబాసిడర్లు, ఎన్జీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే ఈ విత్తన బంతుల ద్వారా పశుపక్షాదులకే కాక సమస్త జీవరాసులకు ఆహారం, వసతి ఆరోగ్యం ఏర్పడుతుందని, అనేక ఔషధ గుణాలు ఉన్న 30 రకాల జాతులకు చెందిన విత్తనాలతో తయారుచేసిన విత్తన బంతులను తయారు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, కార్యదర్శి నల్లనయ్య, డిసిఆర్.ఫణిరామ్, జివిఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

17వ రోజుకు టిడిపి రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - రంపచోడవరం : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 17వ రోజుకు చేరాయి. మాజీ శాసనసభ్యులు వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ దీక్షల్లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబు రమేష్ కార్యకర్తలకు పూల దండలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈ దీక్షలకు సీనియర్ న్యాయవాది చాగంటి శ్రీనివాసరావు మద్దతు తెలియజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా బాబు కోసం మేము సైతం అంటూ సంతకాలు సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కారం సురేష్ బాబు, మరిసెట్ల వెంకటేశ్వరరావు, పెంటపాటి అనంత మోహన్, మట్ట మెహర్ బాబా, జెఎస్ నగేష్, వీకనరసన్న దొర, గొర్లె సునీత తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని నడింపాలెం గ్రామపంచాయతీలో అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి నియోజకవర్గం అభివృద్ధి నిధుల నుండి మంజూరు చేసిన రూ.5 లక్షలతో నిర్మించనున్న సామాజిక భవనం నిర్మాణానికి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎంపీ భర్త, నేను సైతం ఛారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ప్రజల ప్రయోజనాల కొరకు సామాజిక భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎంపీ మాధవికి పంచాయతీ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శరభన్నపాలెం పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ కిముడు సత్యనారాయణ, లోకుల సోమ గాంధీ, బట్ట పనుకుల పంచాయతీ సర్పంచ్ బాలకృష్ణ, సీనియర్ నాయకులు సాంబశివరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కూటూరు సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని కూటూరు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కూటూరు గ్రామంలో శుక్రవారం సిపిఎం నాయకులు రాజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో సభలు జరిపి అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన ప్రాంతంలో పీసా గ్రామసభలు జరిపి రాష్ట్రంలో అభివృద్ధికి నోచుకోని గ్రామాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, సర్పంచ్ బి.వెంకమ్మ, కె.లక్ష్మణ్, నుపా రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు సిఆర్‌టిల సమావేశం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక పిఎంఆర్‌సిలో నిర్వహిస్తున్నట్లు సిఆర్‌టి యూనియన్ జిల్లా అధ్యక్షులు సారపు కృష్ణమూర్తి దొర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో యూనియన్ నాయకులు అలీషా బాబు, వి వెంకటేశ్వర్లు, వి లచ్చిరెడ్డి, ఎం చెన్నారావు, కే లక్ష్మయ్య, డి సురేష్, ఎం రజిత, ఆర్ శైలజ, హైమా, గంగ భవాని ఉన్నారు.

రహదారుల విస్తరణపై దృష్టి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగర రద్దీని దృష్టిలో పెట్టుకొని రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నట్టు జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. శుక్రవారం ఆమె నాలుగో జోన్ పరిధిలోని జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీసు వరకూ పూర్ణా మార్కెట్ రోడ్డు విస్తరణ పనులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు రూ.12.5 కోట్ల వ్యయంతో 2.1 కిలోమీటర్ల మేర 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విశాఖ నగరాన్ని పరిపాలనా రాజధానిగా ప్రకటించి ఆ దిశగా అడుగులు వేస్తున్నందున రోడ్ల రద్దీని తగ్గించేందుకు విస్తరణ అవసరమని తెలిపారు. పూర్ణా మార్కెట్ రోడ్డులో ఎన్నో వాణిజ్య సముదాయాలు ఉన్నందున రోడ్డు విస్తరణ అవసరమన్నారు. ఎన్నో ఏళ్ల నుండి విస్తరణకు నోచుకోలేదని, ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విస్తరణ పనులతో జగదాంబ నుంచి పాత పోస్ట్ ఆఫీస్ వరకు రద్దీని తగ్గించుకోగలమని తెలిపారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి ఏకకాలంలో అమలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కె.అప్పలరత్నం, విల్లూరి భాస్కరరావు, బిపిన్ కుమార్ జైన్, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొల్లు సింహాచలం, జోనల్ కమిషనర్ శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీరు సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక ఇంజినీరు సంతోషి, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.